### కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో).. టమాట 13, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 45, బీర 40, క్యాబేజి 28, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 21, దొండ 35–45, చిక్కుడు 28–50, గోకర 45, బీట్‌రూట్ 20. క్యాప్సికం 50, ఆలు 21, దోస 21, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 50. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

### స్వతంత్ర అభ్యర్థికి మద్దతు

నాగోలు: మల్కాజిగిరి ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైష్ణవి ప్రసాద్‌కు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) పూర్తి మద్దతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. గురువారం కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని వైష్ణవి ప్రసాద్‌కు బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య నాయకులు కలసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. సేవా దృక్పథం వున్న వైష్ణవి ప్రసాద్ వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ గెలిపించాలని కోరారు.

### రేణుకా చౌదరికి సన్మానం



ఎల్‌బీనగర్: రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రేణుకా చౌదరిని గురువారం రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సంరెడ్డి భుజంగరెడ్డి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.రేణుకా చౌదరి దంపతులను గజామాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



వనస్థలిపురం ఫేజ్-2 హుడా కాలనీ ఏ-టైప్ క్వార్టర్స్‌లోని క్రీడా ప్రాంగణం

# ఆటస్థలం.. సౌకర్యాలు శూన్యం

వనస్థలిపురం: కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో విద్యార్థులు, యువకులు ఆడుకోవడానికి సరైన ఆటస్థలాలు కరువయ్యాయి. ఇందుకు భిన్నంగా వనస్థలి పురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ల పరిధిలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో పలు క్రీడా ప్రాంగణాలు ఉన్నా... అవి అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొన్ని ప్రాంగణాలలో క్రీడాకారుల సౌకర్యం కోసం టాయిలెట్లు తదితర ఏర్పాట్లు చేసినా నిర్వహణ లోపంతో అవి మూన్నాళ్ల ముచ్చటగానే మారుతున్నాయి. దీంతో స్థానికంగా ఉన్న యువత గత్యంతరం లేక డబ్బులు వెచ్చించి ప్రైవేటు క్రీడా ప్రాంగణాలవైపు మొగ్గు చూపుతున్నారు.

- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్‌కాలనీలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో విశాలమైన ఛత్రపతి శివాజీ గ్రౌండ్ ఉంది. ఇందులో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 2004లో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేసినా అది నేటికి కార్యరూపం దాల్చలేదు.–- ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు రోజుల్లో మధ్యాహ్నం సైతం విద్యార్థులు, క్రీడాకారులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. కాగా ఇక్కడ తాగునీరు, టాయిలెట్లు, కూర్చోవడానికి బెంచీలు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.



వనస్థలిపురం ఫేజ్-4లోని ఇందిరా ప్లే గ్రౌండ్

- వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వనస్థలిపురం ఫేజ్-4లో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని ఇందిరా ప్లే గ్రౌండ్ ఉంది. ఇక్కడ క్రికెట్ శిక్షణ పొందేవారికోసం నెట్ ఏర్పాటు చేశారు. అయితే మిగతా క్రీడా ప్రాంగణం గుంతలమయంగా మారి విద్యార్థులు, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన టాయిలెట్లకు నీటి సౌకర్యం లేక, నిర్వహణ లోపంతో అవి అధ్వాన్నంగా తయారయ్యాయి.
- వనస్థలిపురం ఫేజ్–2 హుడా కాలనీ ఏ–టైపు క్వార్టర్స్ గ్రౌండ్‌లో ఓ వైపున జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో స్కేటింగ్ గ్రౌండ్‌ను నిర్మించారు. కాగా మిగతా గ్రౌండ్ గుంతలుగా మారి క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన టాయిలెట్లకు సరైన నీటి సౌకర్యం లేక, నిర్వాహణాలోపంతో అవి నిరుపయోగంగా మారాయి.
- అన్ని క్రీడా ప్రాంగణాలలో క్రీడా కారుల కోసం కనీస మౌళిక వసతులైన తాగునీరు, టాయిలెట్లు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలని, గుంతలమయంగా మారిని గ్రౌండ్‌లకు మరమ్మతులు చేపట్టాలని, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఆయా క్రీడలకు సంబంధించిన కోచ్‌లను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

## పురాతన బావిని పునరుద్ధరించాలి



డిప్యూటీ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: శ్రీ రామకృష్ణపురం కాలనీలోని పార్కులో వున్న పురాతన బావి పూడిక తీసి పునరుద్ధరణ కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పున్న గణేష్ నేత గురువారం జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటి కమిషనర్ సుజాతను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ రామ కృష్ణ పురం కాలనీ లోని పార్కులో వున్న పురాతన బావి వినియోగంలో తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే పురం కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం డివిజన్ శక్తినగర్ కాలనీకి చెందిన ఐతరాజు రాజు కుమార్తె హర్షిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం కోసం కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహా యాదవ్ సహాయంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. రూ. 2,50 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. దీనికి సంబంధించిన ఎల్ఓసీ పత్రాన్ని గురువారం మధుయాష్కీగౌడ్ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## ఉచిత వైద్యశిబిరానికి స్పందన



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వైదేహికాలనీ నార్త్ ఓనర్స్ సంఘం, సాయి స్థలి, రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలు సంయుక్తంగా గురువారం సాయిబాబా దేవాలయ అవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో 50సంవత్సరాలు దాటిన మహిళలకు, 60సంవత్సరాలు దాటిన పురుషులకు, జీహెచ్ఎంసీ కార్మికులకు ఉచితంగా వివిధ పరీక్షలు నిర్వహించారు.సమస్య ఉన్న వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు నాగరాజు, రాజేంధర్‌రెడ్డి, వేణుగోపాల్, విద్యాసాగర్, రాంమోహన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్‌లో శుక్రవారం చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు.సాయంత్ర 4గంటలకు భారత్ పెట్రోలియం బంక్ నుంచి వెళ్లే యాత్రలో బీజేపీ జాతీయ కార్యవర్గం సభ్యులు ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి పాల్గొంటారని పేర్కొనారు.ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### నేడు ఎన్టీఆర్ స్టేడియంలో అన్న ప్రసాద వితరణ

కవాడిగూడ: కామాఖ్య మృత శోధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో రాజ శ్యామల అమ్మవారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అన్నప్రసాద వితరణ జరుగనుంది. వాసవి సేవవా సమితి రాంనగర్ నేతృత్వంలో ఆర్య వైశ్య సంఘం గాంధీనగర్, ఆర్యవైశ్య సంఘం చిక్కడపల్లి, వాసవి సేవా కేంద్ర హైదరాబాద్, వాసవి క్లబ్ సంస్థల సౌజన్యంతో మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఆయా సంస్థల ప్రతినిధులు కాసనగట్టు రాజశేఖర్‌గుప్తా, వాడకట్టురాజుగుప్తా, అమరవాది నాగరాజు, అనంతుల ఆంజనేయులు, నీతి సత్యనారాయణ తెలిపారు. గురువారం రాంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో వారు అన్నప్రసాద వితరణ పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శత రాజ శ్యామల యాగం, 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శివపార్వతుల కల్యాణం జరుగుతుందని తెలిపారు.

### మాతృభాష మృత భాష కాదు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతృభాష ఎప్పుడూ మృత భాష కాదని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. లయన్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలుగు భాష సాహిత్యానికి చేసిన కృషి అనితరసాధ్యమన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఎన్‌జీవోస్ నెట్‌వర్క్ కార్యాలయంలో భారత సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ... దేశ భాషలందు తెలుగు లెస్సా అని అన్నారన్నారు. ఎంతో మంది కవుల నోటి నుంచి జాలువారే పాటలు, మాటలు కూడా మాతృభాష సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. చరిత్రలో మాతృభాషకు ఉన్న స్థానం ఎంతో గొప్పదన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్న ఎంత గొప్ప స్థాయికి ఎదగిన మీ సక్సెస్‌కు కారణంగా అమ్మ భాషే అన్నారు. ప్రముఖ కవి బిక్కి కృష్ణా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవి శ్రీనివాస్‌గౌడ్, ప్రముఖ కవులు జల్ది విద్యాధర్, వి.డి.రాజగోపాల్, గుత్త హరి పాల్గొన్నారు.

## 25న భారత్ బచావో సదస్సు

లక్డీకాపూల్ : జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ–2020)ను రద్దు చేయాలని భారత్ బచావో నిర్వాహకులు డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేష్‌బాబులు డిమాండ్ చేశారు. ఉమ్మడి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ నెల 25, 26వ తేదీల్లో నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత విద్యార్థులు సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. అఖిల భారత విశ్వవిద్యాలయాల విద్యార్థులు నిర్వహణలో జరిగే ఈ సదస్సులో సోషల్ డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు ఆకునూని మురళి, భారత్ బచావో చైర్మన్ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతిలతో పాటు వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్టు తెలిపారు.



# మెరుగైన సేవలే రాపిడో లక్ష్యం




రాపిడో కెప్టెన్‌లకు బహుమతులు అందజేస్తున్న పవన్ గుంటుపల్లి

సైదాబాద్: నగరాలు, పట్టణ ప్రాంత వినియోగదారులకు మెరుగైన సేవలు అందిచడమే లక్ష్యంగా రాపిడో కెప్టెన్‌లు విధులు నిర్వహిస్తున్నారని రాపిడో సంస్థ సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి పేర్కొన్నారు. గురువారం చంపాపేటలోని మినర్వా ఫంక్షన్‌హాల్‌లో రాపిడోస్ క్యాబ్ మహోత్సవం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2023 మేలో కార్యకలాపాలు ప్రారంభించిన రాపిడో ప్రస్తుతం 50 వేల మంది కెప్టెన్‌లను సంస్థలో చేర్చుకొని సేవలందిస్తోందన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ సేవలు అందించిన పలువురు కెప్టెన్‌లను ఆయన అభినందించి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గడ్డం ఆత్మచరణ్‌రెడ్డి, హైదరాబాద్ ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ సీ.రమేష్ పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం

**జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా**

చంచల్‌గూడ: దేశంలోనే అత్యుత్తమ శాఖగా తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ కీర్తి గడిచిందని ఆ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. గురువారం చంచల్‌గూడలోని సీకా ఆడిటోరియంలో జరిగిన 3వ బేసిక్ ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో చేపట్టిన పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నియామకాల్లో భాగంగా 136 మంది తెలంగాణ జైళ్ల శాఖ వార్డర్లుగా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భౌతికంగా కనిపించే జైళ్లను మానసికంగా చూస్తే ఎంతో వ్యత్యాసం ఉంటుందన్నారు. జైళ్లంటే నాలుగు పెద్ద గోడలుగా కనిపిస్తుందని కానీ అందుల్లో విభిన్న రకమైన వ్యక్తులు తారసపడుతారన్నారు. అందరినీ సమానంగా సంస్కరించడమే జైళ్ల శాఖ ముఖ్య ఉద్దేశమన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఇస్తున్న శిక్షణకు ఆకర్షితులైన తీహార్ జైళ్ల శాఖ వారి సిబ్బందికి ఇక్కడ 9 నెలల పాటు శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. జైళ్ల శాఖ ఐజీలు మురళీబాబు, ఎం. రాజేష్‌లు మాట్లాడుతూ వార్డర్లుగా ఎంపికైన వారికి 9 నెలల పాటు అన్ని విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ రేంజ్ డీఐజీ డా. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా



వార్డర్లుగా ఎంపిక అభ్యర్థులు

# నిధుల్లేక నిలిచిన పనులు!

**అసంపూర్తిగా మహిళా మండలి భవనం**

- ఆరు నెలలుగా స్లాబ్‌కే పరిమితం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న మహిళలు



అసంపూర్తిగా దర్శనమిస్తున్న మహిళా మండలి భవనం




శంకుస్థాపన సమయంలో వేసిన శిలాఫలకం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిధుల లేమితో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ పరిధిలోని హుడాకాంప్లెక్స్‌లో మహిళా సమాఖ్య భవనానికి ఆరు నెలల క్రితం స్లాబు వేశారు. మిగతా పనులు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పనుల నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ నుంచి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గతేడాది జూన్ 2న పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. భవనం లేకపోవడంతో సభలు, సమావేశాలకు అవస్థలు పడుతున్నామని, ఇప్పటికే మంజూరైన నిధులను కొత్త ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మహిళా సమాఖ్య సభ్యులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిధులు విడుదల చేయాలి..**

నిధులు లేకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పార్కుల్లో మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారింది. కొత్త ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయడంతో పాటు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ఆకుల శ్రీవాణి, కార్పొరేటర్, సరూర్‌నగర్



# బ్లడ్ బ్యాంక్‌లో ఆకస్మిక తనిఖీలు

చైతన్యపురి: తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు రెండు రోజుల పాటు నగరంలోని పలు బ్లడ్ బ్యాంక్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో బాగంగా చైతన్యపురి కమలానగర్‌లోని నవజీవన్ బ్లడ్‌బ్యాంక్‌లో తనిఖీలు నిర్వహించారు. రికార్డుల మెయింటనెన్స్, బ్లడ్ స్టోరేజ్ విధానం, దాతలకు సంబందించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. రూ.400కు ఇవ్వాల్సి ప్లేట్‌లెట్స్ కోసం రూ.1200 వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల అనంతరం బ్లడ్ బ్యాంక్ నిర్వహకులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.



చైతన్యపురి నవజీవన్ బ్లడ్ బ్యాంక్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

# సేవా గుణాన్ని పెంచే స్కౌట్స్ అండ్ గైడ్స్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులలో సేవా గుణాన్ని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగపడుతుందని రంగారెడ్డి జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెజరర్ నారాయణరెడ్డి, జిల్లా కమీషనర్ సి.హెచ్ మినేందర్ రావు అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్ హరిపురికాలనీలో సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో లార్డ్ బెడన్ పవక్స్ జన్మదినం సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తి పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమీషనర్ ఇందిరారెడ్డి, జిల్లా ఆర్గనైజర్ కమీషనర్ శ్రీనివాస్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో సిరి మాల్, జ్యువలరీ షోరూం ప్రారంభం

హుడాకాంప్లెక్స్: క్వాలిటీ జ్యువలరీ, కంచిపట్టు వస్త్రాలు మార్కెట్ ధర కన్నా తక్కువకు ఒకే చోట లభిస్తున్నాయని, కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సినీనటి, యాంకర్ రష్మీ అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట పరిధి లక్ష్మీనర్సింహపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిరి షాపింగ్ హాల్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం రష్మి మాట్లాడుతూ.. అన్ని శుభకార్యాలకు అవసరమైన నగలు, వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టెంపుల్ జ్యువలరీ బాగా నచ్చాయని తెలిపారు. కొత్తపేటలో తమ స్టోర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని సిరి షాపింగ్ మాల్, సిల్క్స్ నిర్వాహకులు శనపతి రమేశ్, చేతన్ తెలిపారు.



షాపింగ్ మాల్, జ్యువెలరీ షోరూను ప్రారంభిస్తున్న రష్మీ

# మాతృభాష చరిత్రకు సజీవ సాక్ష్యం

**ఓయూ రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి**

కాచిగూడ: మాతృభాష అంటే కేవలం ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే భావవ్యక్తీకరణ మాత్రమే కాదని అది మనవ జాతి జీవనాడి అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ మాజీ అధిపతి ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మాతృభాష అంటే వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతికి సజీవ సాక్ష్యమని అన్నారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. భాషను దూరం చేసుకుంటే మన ఉనికికే ప్రమాదమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 7వేల భాషలున్నాయని, వీటిలో ప్రపంచంలో సగానికి పైగా 23 భాషలు మాట్లాడుతున్నారని తెలిపారు. మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష అమ్మభాష అని పేర్కొన్నారు. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించడం సులభమని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం ప్రొఫెసర్ కె.సంగీత మాట్లాడుతూ.. మాతృభాషను విస్మరించడమంటే కన్నతల్లిని మర్చిపోవడం లాంటిదేనని చెప్పారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట్‌రావు, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, కార్యదర్శి సాయిరామ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఓయూ హిందీ విభాగం ప్రొఫెసర్ సంగీత